క్లుప్తంగా

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం తరగతులు నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ, యూఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు సన్నీగౌడ్, మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. పాఠశాలకు వెళ్లి తరగతులు నిర్వహిస్తున్న విషయమై యాజమాన్యాన్ని ప్రశ్నించటంతో, విద్యార్థులను ఇంటికి పంపిచారన్నారు. సెలవు రోజుల్లో తరగతుల బోధనలు చేపట్టి, మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో క్లాసులు నిర్వహించిన యాజమాన్యంపై చర్యలు తీసుకొని, గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థికసాయం

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా విధుల నిర్వర్తించిన శనిగారపు రాజలింగం పక్షవాతంతో మంచం పట్టాడు. దీంతో ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం పాఠశాలలో చదివిన 2005–06 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ.5వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం

దండేపల్లి: మండలంలోని కాసిపేటకు చెందిన విమల ఇటీవల భర్త చేతిలో హత్యకు గురయ్యింది. దీంతో ఆమె ముగ్గురు పిల్లలు అనాథలుగా మారడంతో వారికి గ్రామానికి చెందిన హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు ఆదివారం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సునీల్, వెంకటేష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

దండేపల్లి: మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక పద్మశాలి భవన్‌లో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుంచె ప్రసాద్, అధ్యక్షుడిగా బండి రవి, ఉపాధ్యక్షులుగా బూసిరాజు రాజన్న, మెంగని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల రాజన్న, కార్యదర్శిగా మహ్మద్ శరీఫ్, సంయుక్త కార్యదర్శిగా ఎస్పీ హరీష్, కోశాధికారిగా మోదంపురం వెంకటేష్, ప్రచార కార్యదర్శిగా ఎనగందుల సత్యం, అధికార ప్రతినిధిగా చక్రపాణి, సలహాదారులుగా గోపతి శ్రీనివాస్, గాలిపల్లి వెంకటపతి, గడ్డం సత్యం, సభ్యులుగా అల్లంల కుమారస్వామి, బచ్చల సుభాష్, సద్దాం ఎన్నికయ్యారు.

బిల్లులు పెండింగ్..!

- అభివృద్ధి పనులకు డీఎంఎఫ్‌టీ, టీయూఎఫ్ఐడీసీ నిధులు కేటాయింపు
- చేసిన పనులకు బిల్లులు రాలేదంటూ కాంట్రాక్టర్ల ఆవేదన
- ఉన్నతాధికారులకు నివేదించామని అధికారుల వెల్లడి
- మందమర్రి మున్సిపాలిటీలో నిలిచిన అభివృద్ధి



పునాది స్థాయిలోనే నిలిపేసిన దోభీఘాట్ పనులు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో డీఎంఎఫ్‌టీ, టీయూఎఫ్ఐడీసీ నిధుల పేరిట చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు రాకపోవడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి కోసం చేపట్టిన పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జరిగిన అభివృద్ధి పనులకు గాను బిల్లులు రాకపోవడంతో, కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. కలెక్టర్‌కు చెప్పుకున్నా ఫలితం లేకపోవడంతో, దిక్కుతోచని పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోతే, పనులు ఎందుకు ప్రారంభించమన్నారని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పనులు అప్పులు తెచ్చి చేశామని, జరిగిన పనులకు బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

చేపట్టిన పనులు...

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో డీఎంఎఫ్‌టీ, టీయూఎఫ్ఐడీసీ నిధులతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా ఊరుమందమర్రి ఊర చెరువు మినీ ట్యాంకుబాండ్ సుందరీకరణ కోసం సంవత్సరం క్రితం రూ.80లక్షల నిధులతో టెండర్ పిలవగా, చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టి 90శాతం పనులు పూర్తి చేసి సుమారు రూ.70లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఇంత వరకు రూ.23లక్షలు మాత్రమే బిల్లు చెల్లించడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో ప్యాకేజీ కింద పలు పనులకు టెండర్ పూర్తి కాగా, కొన్ని పనులు అసలే ప్రారంభించలేదు. ప్రారంభించిన పనుల్లో కేకే–5 గని సమీపంలోని వైకుంఠధామం, కోల్‌బెల్ట్ రహదారిపై డివైడర్ పనులు రూ.3కోట్ల 67లక్షల నిధులతో టెండర్ కాగా, ఇంత వరకు 80శాతం పనులు పూర్తైనప్పటికీ రూ.2కోట్ల 44లక్షలు మాత్రమే బిల్లులు చెల్లించగా, జరిగిన అభివృద్ధికి ఇంకా రూ.కోటి 23లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది. రూ.2కోట్ల నిధులతో యాపల్ ఏరియా కేకే–2 సాండ్ బంకర్ సమీపంలోని వైకుంఠధామం, ముస్లిం, క్రిస్టియన్ గ్రేవ్ యార్డ్ పనులు ప్రారంభదశలోనే కాంట్రాక్టర్‌కు పనులు నిలిపివేయాలని మాట మాత్రం చెప్పారు. కానీ ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. అలాగే రెండు రూ.కోట్ల నిధుల కేటాయింపుతో ధోభీఘాట్ పనులు సంవత్సరం క్రితం ప్రారంభించగా ఇంత వరకు సుమారు రూ.15లక్షల వరకు పనులు జరిగినా, ఒక్క పైసా కూడా బిల్లులు రాకపోవడంతో బేస్మెంట్ లెవల్‌లోనే పనులు నిలిపేయాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా కాంట్రాక్టర్లకు పూర్తైన అభివృద్ధి పనులకు గాను రెండు సంవత్సరాలకు చెల్లించాల్సిన 46చెక్కులకు సంబంధించి ఎఫ్ఎస్‌డీ (ఫిక్స్‌డ్ సేవింగ్ డిపాజిట్) కూడా సుమారు రూ.కోటి 75లక్షల వరకు ప్రభుత్వం బకాయి ఉందని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

అధికారులకు నివేదించాం



మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో డీఎంఎఫ్‌టీ, టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా జరిగిన అభివృద్ధి పనుల వివరాలు కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. అక్కడి నుంచి ఎలాంటి ఆదేశాలు వస్తే, ఆ ఆదేశాలు అమలు చేస్తాం. ప్రస్తుతం కాంట్రాక్టర్లు సకాలంలో బిల్లులు రాక పనులు నిలిపివేశారు.

–ఎం.సుమతి, మున్సిపల్ డీఈ, మందమర్రి



హమాలివాడ రోడ్డుపై పారుతున్న డ్రైయినేజీ నీరు



బైపాస్ రోడ్డు మధ్యలోని డివైడర్‌పై పెరుగుతున్న పిచ్చి మొక్కలు

స్వచ్ఛదనం లేదు.. పచ్చదనం కానరాదు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛదనం–పచ్చదనం కానరావడం లేదు. వర్షాకాలం వానలు కురుస్తుండగా, మొక్కలను నాటాల్సిన సమయంలోనూ మొక్కలు నాటే కార్యక్రమాలను పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో పచ్చదనం కనిపించడం లేదు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో పారిశుధ్యంను మెరుగుపర్చాల్సి ఉన్నా, ఆ దిశగా మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని మంచిర్యాల మున్సిపాలిటీలోని 36వార్డుల్లో చేపట్టారు. వర్షాలు కురుస్తుండడంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, మొక్కలను పెంచి వాటిని సంరక్షించుకోవాలనే ఉద్దేశంతో వనమహోత్సవం పేరిట పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఖాళీ స్థలాల్లో చెత్తా చెదారాన్ని ప్రజలు వేస్తుండగా, రోజుల తరబడి అవి పేరుకుపోతున్నాయి. పందుల బెడద మాత్రం పోవడం లేదు. డ్రైయినేజీ నీరు పోలేని ప్రాంతాల్లో నీరు నిల్వతో దుర్వాసన వెదజల్లుతూ దోమలు విజృంభిస్తున్నాయి. వనమహోత్సవం పేరిట మొక్కలను నాటాల్సిన చోట నాటకపోవడంతో లక్ష్మీ థియేటర్ చౌరస్తా నుంచి వైశ్యభవన్ వరకు ఉన్న బైపాస్ రోడ్డు మధ్యలో డివైడర్‌లో పిచ్చి మొక్కలు పెరిగాయి. డివైడర్ మధ్యలో మొక్కలను నాటాల్సి ఉన్నా, ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఏటా మొక్కలను నాటేందుకు గాను రూ.లక్షల్లో నిధులు కేటాయిస్తున్నా పచ్చదనం మాత్రం కనిపించడం లేదు. బైపాస్ రోడ్డు డివైడర్‌లో మొక్కలను నాటకపోవడం వల్ల పిచ్చి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. ఇందులో తుమ్మచెట్లు పెరుగుతుండడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులకు తుమ్మ చెట్టు కొమ్మలు తగిలి ముళ్లు గుచ్చుతున్నాయి.



రాంనగర్‌లో ఇళ్ల మధ్య వేసిన చెత్త

కొండ చిలువ కలకలం



మందమర్రిలో పట్టుకున్న కొండచిలువతో స్నేక్ క్యాచర్స్

రామకృష్ణాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలోకి ఆదివారం సాయంత్రం ఓ భారీ కొండచిలువ ప్రవేశించటం కలకలం రేపింది. సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం నుంచి కాలనీ వైపు వచ్చిన కొండచిలువను గమనించిన స్థానికులు, కర్రల సాయంతో చంపివేశారు. ఏపుగా మొలచిన చెట్ల పొదల కారణంగా తరచూ విషపురుగులు ప్రవేశిస్తున్నా, ఏ ఒక్కరూ పట్టించుకోవటం లేదని కాలనీవాసులు మండిపడ్డారు.

మందమర్రిలో పిల్లిని మింగిన కొండచిలువ

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని సీఈఆర్ క్లబ్ ఎదుట గల గాంధీనగర్‌లో కొండ చిలువ ఆదివారం హల్‌చల్ చేసింది. గాంధీనగర్ పక్క నుంచి వెళ్లే ఒర్రె పక్కన గల తుమ్మ రవీందర్ ఇంట్లోకి చేరింది. ఇంట్లో సామాను వెతుకుతుండగా కొండ చిలువ కనిపించింది. వెంటనే పాములు పట్టే మహేందర్ అనే వ్యక్తికి సమాచారం అందించగా, ఆయన టీమ్‌తో వచ్చి కొండ చిలువను పట్టాడు. ఈ క్రమంలో దాని కడుపులో నుంచి పిల్లి కళేబరం బయటికి రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అనంతరం కొండచిలువను భద్రంగా తీసుకెళ్లి అటవీ ప్రాంతంలో వదిలి పెట్టినట్లు మహేందర్, వారి టీమ్ తెలిపింది.



రామకృష్ణాపూర్: హతమైన కొండ చిలువ

మందమర్రి పేరిట బోర్డు ఏర్పాటు చేయరూ..!



ఫ్లై ఓవర్ వద్ద మందమర్రి ఊరుపేరు లేకుండా ఏర్పాటు చేసిన బోర్డు

మందమర్రిరూరల్: మంచిర్యాల జిల్లా కేంద్రానికి సుమారు 15కిలో మీటర్ల దూరంలో గల మందమర్రి పట్టణం ఒక మున్సిపాలిటీ, సింగరేణి ఏరియా నెలకొన్న ప్రాంతం. సుమారు 60వేల జనాభా కలిగి నిత్యం వేలాది మంది రాకపోకలు కొనసాగిస్తూ ఉంటారు. ఇటీవల నూతన జాతీయ రహదారి ఏర్పాటు చేయడంతో ఈ పట్టణానికి మరింత వన్నె వచ్చింది. ఈ పట్టణంలోని జాతీయ రహదారి మీదుగా ఇతర రాష్ట్రాలకు వాహనదారులు వెళ్తుంటారు. కానీ ఈ పట్టణానికి సంబంధిత అధికారులు మాత్రం కనీసం మందమర్రి పేరిట ఊరు పేరు తెలిసే విధంగా బోర్డు పెట్టలేదు. దీంతో కొంత మంది వాహనదారులు మందమర్రి ఊరుపేరు గల బోర్డు లేకపోవడంతో ఊరుదాటి బెల్లంపల్లి వరకు వెళ్లిన తర్వాత మందమర్రి దాటిన విషయం తెలుసుకొని, వెనక్కి వచ్చిన సందర్భాలు ఉన్నాయని పలువురు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పాత జాతీయ రహదారి పక్కన మందమర్రి ఊరు పేరిట సూచిక బోర్డు పెట్టించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కేజీవీల్స్‌తో బీటీ రోడ్లు ధ్వంసం



నెన్నెల బీటీ రోడ్డుపై వెళ్తున్న కేజీవీల్స్ ట్రాక్టర్

- నిబంధనలు బేఖాతర్
- దృష్టి సారించని అధికారులు



ధ్వంసమైన రోడ్డు

నెన్నెల: నియోజకవర్గంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వ్యవసాయ పనుల్లో భాగంగా నారుమడులలో దమ్ము కొట్టడానికి ట్రాక్టర్లు దమ్ము చక్రాలు (కేజీవీల్స్) వేసుకొని బీటీ రోడ్లపై యథేచ్ఛగా నడుపుతున్నారు. దీంతో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బీటీ రోడ్లు ధ్వంసమైపోతున్నాయి. చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ట్రాక్టర్లు కేజీవీల్స్‌తో రోడ్లపై నడపరాదనే నిబంధనలు ఉన్నా, ట్రాక్టర్ యజమానులు పట్టించుకోకపోవడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కేజీవీల్స్‌లను బీటీ రోడ్లపై నడిపించవద్దన్న నిబంధనలను యజమానులు బేఖాతరు చేస్తున్నారు. నెన్నెల, భీమిని, కన్నెపల్లి, బెల్లంపల్లి, వేమనపల్లి, తాండూర్ రోడ్లపై ట్రాక్టర్లు విచ్చలవిడిగా కేజీవీల్స్‌తో తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు ఇవీ..

ట్రాక్టర్‌తో పొలం వరకు వెళ్లి అక్కడ వీల్స్‌ను అమర్చుకోవాలి. ట్రాలీలలో వీల్స్‌ను పొలం వరకు తరలించి, పొలం వద్ద దమ్ము చక్రాలను బిగించుకోవాలి. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో మళ్లీ వీల్స్‌ను ఊడగొట్టి ట్రాక్టర్‌పైన ట్రాలీలలో ఎక్కించుకొని రావాలి. కేజీవీల్స్‌ను రోడ్డుకు ఆనకుండా ఎత్తుగా బిగించుకోవాలి. కానీ యజమానులు ఇవేమి పట్టించుకోవడం లేదు. నిబంధనలు పాటించని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మొక్కలు ఎండిపోగా వృథాగా తొట్టీలు

పగిలిన తొట్టీలు... ఎండిన మొక్కలు

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి కాల్‌టెక్స్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన సిమెంట్ పూల తొట్టీలు సరైన నిర్వహణ లేక అధ్వాన్నంగా తయారయ్యాయి. వీటి కోసం వెచ్చించిన లక్షల రూపాయలు నిష్ప్రయోజనంగా మారాయనే విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడటడంతో పలు సిమెంట్ తొట్టీలు పగిలిపోయి మొక్కల పెంపకం చేపట్టని పరిస్థితులు ఉండగా, పదుల సంఖ్యలో పూలమొక్కలు సరిగ్గా నీటి తడులు అందించక, సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ఎండిపోయాయి. ఎండిపోయిన పూల మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాల్సి ఉండగా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటం మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లిప్తతకు అద్దం పడుతోంది. ఏర్పాటు చేసిన ఏడాది కాలంలోపే సిమెంట్ తొట్టీలు, పూల మొక్కలు క్రమంగా ఆనవాళ్లు కోల్పోవడంతో ఖర్చు చేసిన ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారిందనే విమర్శలు పురప్రజల నుంచి వస్తున్నాయి. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు సానుకూలంగా స్పందించి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై పూల మొక్కల సంరక్షణ చర్యలను చిత్తశుద్ధితో నిర్వహించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి




ఎమ్మెల్సీ కోదండరాంతో వెంకటసాయి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను ఆదివారం తెలంగాణ జనసమితి సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కన్వీనర్ పాముల వెంకటసాయి హైదరాబాద్‌తో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంచిర్యాల జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ కోదండరాం జిల్లాను అభివృద్ధి పదంలో నిలిపేలా పెద్దపీట వేయాలని విన్నవించి, ఎమ్మెల్సీగా జిల్లా పర్యటన చేపట్టాలని కోరినట్లు వెంకటసాయి తెలిపారు.

కాంబోజీపేటలో సమస్యల తిష్ట



మురుగు కాలువలు లేక చేతిపంపు వద్ద నిలిచిన నీరు



ఇళ్ల మధ్యలో చేరిన మురుగు నీరు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కాంబోజీపేట గ్రామంలో ఇంటింటికి మరుగుదొడ్డి నిర్మించుకున్నా, సరైన మురుగు కాలువలు లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో సుమారు 50కుటుంబాల వరకు జీవనం కొనసాగిస్తున్నా స్థానిక సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. చేతిపంపు వద్ద కాలువలు లేకపోవడంతో నీరంతా చేతిపంపు చుట్టూ చేరుతుంది. గ్రామంలోని ఖాళీ స్థలంలో ఇళ్ల మధ్యలోకి మురికి నీరు వచ్చి చేరుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల పాలవుతున్నారు. గ్రామంలో బోరుబావికి ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ కాలిపోయి ఏళ్లు గడుస్తోంది. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. బురదరోడ్డుతో ఇబ్బందులు..!



భీమారం: మండలకేంద్రం నుంచి సుంకరిపల్లి వెళ్లే రోడ్డు బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భీమారం బస్టాండ్ నుంచి చెరువు కట్టపై నుంచి నిర్మించిన మట్టి రోడ్డు వర్షాల కారణంగా బురదగా మారుతుందని సుంకరపల్లి గ్రామస్తులు పేర్కొన్నారు. రహదారిపై నడవలేని విధంగా బురద ఏర్పడుతుందని వాపోతున్నారు. పాఠశాలకి వెళ్లే విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో చెన్నూర్ ఎమ్మెల్యేగా పనిచేసిన బాల్క సుమన్ చెరువుకట్టని అభివృద్ధి చేసి, మినీట్యాంక్ బండ్‌గా మార్చుతా అని హామీ ఇచ్చినప్పటికీ, దానికి కార్యరూపంలోకి తీసుకురాలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకొని చెరువుకట్టపై గల బురదరోడ్డుని సీసీగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

– సంబంధిత అధికారి : సత్యనారాయణగౌడ్, ఎంపీడీవో – ఫోన్ నంబర్ : 99080 82359

కల్వర్టు నిర్మించి.. కష్టాలు తీర్చండి



చెన్నూర్‌రూరల్: మండలంలోని లింగంపల్లిలో పంట పొలాలకు వెళ్లే దారిలో ఒర్రెపై కల్వర్టు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని ఒర్రెపై కల్వర్టు నిర్మించి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.